క్లుప్తంగా

వైభవంగా కుంభాభిషేకం


ఆలయంలో కొలువైన కామాక్షమ్మ అమ్మవారు

వరదయ్యపాళెం: మండలంలోని అంబూరులో నూతనంగా నిర్మించిన శ్రీకామాక్షమ్మ అమ్మవారి ఆలయ కుంభాభిషేక ఉత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర స్థాపన పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు ధర్మకర్త సాయిరెడ్డి, ప్రధాన ఆలయ నిర్మాణ దాత ప్రసన్నకుమార్ రెడ్డి స్వాగతం పలికారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు దయాకర్ రెడ్డి, విద్యానాథరెడ్డి, మండల మాజీ కన్వీనర్ పాల సుబ్రమణ్యం రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, శివ, ఎస్‌ఐ నాగార్జున రెడ్డి ఉన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే సాయం


సాయం అందజేస్తున్న బియ్యపు ఆకర్ష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని జైహింద్ పురానికి చెందిన నక్కా రంగయ్య, పానగల్ సమీపంలోని రాములవారివీధికి చెందిన మణి గురువారం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమారుడు బియ్యపు ఆకర్ష్‌రెడ్డిని పంపి, దహనక్రియలకు రూ.10 వేల చొప్పున ఇరు కుటుంబాలకు అందజేశారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని వారికి తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మృతి చెందిన బాలాజీ

శ్రీకాళహస్తి: పట్టణంలోని మిట్టకండ్రిగ వద్ద గురువారం బస్సు ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మలిశెట్టి బాలాజీ(39) మృతి చెందాడు. వన్ టౌన్ ఎస్‌ఐ తిమ్మయ్య కథనం.. గుడూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వెళ్తూ మార్గమధ్యంలోని మిట్టకండ్రిగ వద్ద శ్రీకాళహస్తి వైపు బైక్‌పై వెళ్తున్న బాలాజీని ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలాజీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. బాలాజీకి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. బాలాజీ మృతిపై స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఆయన కుమార్తె పవిత్రారెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

మువ్వన్నెల జెండా రెపరెపలు


శ్రీకాళహస్తి దేవస్థానం పరిపాలన భవనంలో భారతమాతకు పుష్పాంజలి ఘటిస్తున్న ఈఓ, చైర్మన్

శ్రీకాళహస్తి: మున్సిపల్ పరిధిలో 74వ గణతంత్ర దినోత్సవాన్ని గురువారం పాఠశాలలు, కార్యాలయాల్లో ఘనంగా జరుపుకున్నారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పరిపాలన భవనం వద్ద చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, ఈవో కేవీ సాగర్‌బాబు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో అధికారులు జెండాను ఎగురవేశారు. సబ్‌జైల్‌లో సూపరింటెండెంట్ శ్రీకాంత్, శ్రీకాళహస్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ చైర్మన్ శెట్టిపల్లి సురేష్, ప్రెస్‌క్లబ్‌లో గౌరవ అధ్యక్షుడు వీసీ వెంకటయ్య, అధ్యక్షుడు కామేష్ ఆధ్వర్యంలో, ఔషధ తనిఖీ కేంద్రంలో అధికారి రుతు ఆధ్వర్యంలో జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డ్రగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నందా నరసింహులు, సెక్రటరీ మునిరెడ్డి సభ్యులు పాల్గొన్నారు. బీజేపీ మీడియా రాష్ట్ర ప్రతినిధి కోలాఆనంద్ ఆధ్వర్యంలో భేరివారి మండపం వద్ద జెండా విష్కరణ జరిగింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కొండారెడ్డి ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. ఆర్‌పీబీఎస్ జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో విద్యా కమిటీ చైర్మన్ అర్కాడ్ శంకర్ ఆధ్వర్యంలో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలల్లో విద్యార్థులకు కేక్‌లు, చాకెట్లు పంచిపెట్టారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీనాయక్ తిరుపతి కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ నుంచి ప్రశాంశపత్రం అందుకున్నారు.

రేణిగుంట: పట్టణంలో గణతంత్ర దిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ శివప్రసాద్, అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సీఐ సుబ్బారెడ్డి, ఎస్‌ఐ ఈశ్వరయ్య, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, రేణిగుంట పట్టణ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ఆర్.నగేషం జాతీయ జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర సమరయోధుల పోరాటాలను స్మరించుకున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద..

పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి జెండా వందనం చేశారు. వైస్ ఎంపీపీ సుజాత, పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, సర్పంచ్ నగేషం, మండల కోఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు. ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వెదుళ్లచెరువు ఎస్టీ కాలనీ పాఠశాలలో సంస్థ అధ్యక్షుడు జూలియస్ రాజు నోటుపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లను అందించారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: ఎంపీడీఓ కార్యాలయం, అముదూరు అమృత్ సరోవర్ వద్ద వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీహరి, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు ఉదయ్‌సంతోష్, సింగిల్‌విండో కార్యాలయంలో చైర్మెన్ జనార్దన్, పాపానాయుడుపేట జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి, ఆయా గ్రామాల్లో సర్పంచ్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. వికృతమాల, పెన్నగడం, నచ్చనేరి, ఏర్పేడులో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ తిరుమలయ్య, ఎంపీపీ గీత, వైస్ ఎంపీపీలు జనార్ధన్, శ్రీనివాసులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలంలోని పొయ్యి హైస్కూల్‌లో ఎంపీపీ ఉన్నం నిర్మలమ్మ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వాసుదేవనాయుడు, సర్పంచ్ సక్కుబాయమ్మ, హెచ్‌ఎం విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో జెండా ఆవిష్కరణలు జరిగాయి.


శ్రీకాళహస్తి బాలుర హైస్కూల్‌లో..


శ్రీకాళహస్తి: డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ..


రేణిగుంట తహసీల్దార్ కార్యాలయంలో..






శ్రీకాళహస్తి సబ్‌జైల్‌లో జెండా వందనం, ఏర్పేడు తహసీల్దారు కార్యాలయంలో, రేణిగుంట : వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద , పొయ్యి హైస్కూల్‌లో.., ఏర్పేడు : జెండా ఆవిష్కరణలో గున్నేరి కిషోర్‌రెడ్డి

వ్యాసరచన పోటీలు


విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

రేణిగుంట: రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులకు గురువారం తిరుపతి ఎంవో టెరిటరీ సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించి, ప్రతిభ చూపిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. అలాగే పాఠశాల ఆవరణలో జరిగిన 74వ గణతంత్ర దినోత్సవ సంబరాల్లో సంస్థ ప్రతినిధులు అనిల్‌కుమార్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, మధు పాల్గొని జెండా వందనం చేశారు. హెచ్‌ఎం విష్ణువర్ధనం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోమియో వైద్య శిబిరానికి స్పందన

కేవీబీపురం: మండలంలోని కాట్రపల్లెలో బీజేపీ నేత కోలా ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో తేజో భారత్ కార్యక్రమం కింద గురువారం నిర్వహించిన మెగా హోమియోపతి వైద్య శిబిరానికి స్పందన లభించింది. శిబిరాన్ని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 700 మంది రోగులకు శిబిరానికి హాజరయ్యారు. రోగులకు గుజరాత్‌కు చెందిన ప్రముఖ హోమియోపతి వైద్యురాలు హేతల్ జరీవాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య, సర్పంచ్ సురేంద్ర, నాయకులు నందకుమార్, హరిబాబు, అరుణ్, మూర్తి సుబ్బన్న, గుజరాత్ హోమియోపతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జీవాలకు ప్రాణవాయువు సంచార పశు వైద్యం


సంచార పశు వైద్యాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం: గ్రామీణ ప్రాంత పశువుల వైద్యానికి వైఎస్సార్ పశు ఆరోగ్య సేవ ప్రాణ వాయువని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. సత్యవేడుకు మంజూరు అయిన వైఎస్సార్ పశు ఆరోగ్య వాహనాన్ని గురువారం ఎమ్మెల్యే ఎంపీడీఓ కార్యాలయం వద్ద లాంఛనంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆనారోగ్యం బారిన పడే పశువుల వైద్యానికి సంచార పశువైద్య వాహనం ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు. పాడి పశువులతోపాటు, పెంపుడు జంతువులు అనారోగ్యానికి గురైయితే 1962 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేస్తే ఇంటి వద్దకే సంచార వాహనం వచ్చి వైద్య సిబ్బంది సేవలు అందిస్తారన్నారు. ఈ వాహనంలో 35 రకాల టెస్టులు చేసే ల్యాబ్ సౌకర్యం, ప్రాథమిక వైద్య సేవలు, మైనర్ సర్జరీలు చేసుకునే వెసులుబాటు ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతిమ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుశీల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి బాలాజీరెడ్డి, మండల వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ రవిరెడ్డి, పశువైద్యశాఖ ఏడీ భాస్కర్ పాల్గొన్నారు.

28న ద్విచక్ర వాహనాల వేలం

కార్వేటినగరం: ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, శ్రీరంగరాజ పురం, వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాల్లో వివిధ కేసుల్లో సీజ్ చేసిన 12 ద్విచక్ర వాహనాలను ఈనెల 28వ తేదీ వేలం వేయనున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. గురువారం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10.30 గంటలకు వేలం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు కార్యాలయంలో ముందస్తు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొన వచ్చని తెలిపారు.

టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



శ్రీకాళహస్తి: పట్టణంలోని దక్షిణకైలాసనగర్ సమీపంలో ఉన్న విక్రమ్ స్పోర్ట్స్ అకాడమీ, విక్రమ్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్ మెయిన్ డ్రాను ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో చిన్న పిల్లలతో పాటు 70 సంవత్సరాల క్రీడాకారులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఆమె టెన్నిస్ ఆడి అందరినీ ఉత్సాహపరిచారు. ఆల్ ఇండియా టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ వైస్ చైర్మన్ కేఎస్ఆర్ మోహన్‌రావు, రిటైర్డ్ జడ్జి రామకృష్ణ, ఆర్గనైజింగ్ డైరెక్టర్ డిఎస్ఎన్ రాజు, శ్రీకాళహస్తి రిటైర్డ్ ప్రిన్సిపల్ దాశరథి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా అక్షరాభ్యాసం

తిరుపతి కల్చరల్: వసంత పంచమిని పురస్కరించుకొని రాముల వారి దక్షిణ మాడ వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక కేంద్రంలో గురువారం శాస్త్రోక్తంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతీ అమ్మవారిని కొలువు తీర్చి గణపతి, సరస్వతీ హోమం నిర్వహించారు. అనంతరం 50 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

దేవస్థానం అనుబంధంలోకి వీరభద్రస్వామి ఆలయం


వీరభద్రస్వామి ఆలయాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు

- త్వరలో మహా కుంభాభిషేకం
- శ్రీకాళహస్తి దేవస్థానం చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): చిన్నసింగమాలలోని పురాతన, ప్రముఖ శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని త్వరలోనే శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంలోకి అధికారికంగా విలీనం చేసి అభివృద్ధి చేస్తామని పాలక మండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తెలిపారు. మహా కుంభాభిషేకం నిర్వహిస్తామని వెల్లడించారు. గురువారం శ్రీ వీరభద్రస్వామి ఆలయాన్ని అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్ బాబు పరిశీలించారు. పురాణ చరిత్ర కలిగిన ఈ ఆలయాన్ని శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి అనుబంధం చేయాలని కొన్నేళ్లుగా గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ఇటీవల దేవస్థానం ధర్మకర్తల మండలి సమావేశంలోనూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సూచనలతో వీరభద్రస్వామి ఆలయాన్ని దేవస్థానం అనుబంధంలోకి తీసుకుంటూ తీర్మానం ఆమోదించారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని వారు పరిశీలించారు. ఆలయ అర్చకులు, గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం చైర్మన్ మాట్లాడుతూ ఆలయాన్ని త్వరలోనే దేవస్థానం అనుబంధ ఆలయంగా విలీనం చేసి అధికారికంగా ప్రకటిస్తామని తెలిపారు. ఆలయాన్ని అభివృద్ధి చేసి మహా కుంభాభిషేకం కూడా నిర్వహిస్తామని తెలిపారు. దశాబ్దాలుగా ఈ ఆలయాన్ని శ్రీకాళహస్తి దేవస్థానానికి అనుబంధం చేయాలన్న ప్రతిపాదనలు ఆచరణలోకి రాలేదనిని, తమ ధర్మకర్తల మండలి ప్రత్యేక చొరవ చూపి విలీనం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు భక్తవత్సలం, వెంకట్ రమణ, లోకేష్, ప్రసాద్, ముని ప్రకాష్, యువనేష్, ఉదయ్ కుమార్, సుబ్రహ్మణ్యం, దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

ఘనం.. గణతంత్ర దినోత్సవం

నారాయణవనం: సత్యవేడు నియోజకవర్గంలోని అన్ని మండల కార్యాలయాల్లో గురువారం గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నింగిలో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మండల పరిషత్, పోలీస్ స్టేషన్ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి జెండాను ఎగురవేసి, వందన సమర్పణ చేశారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదిమూలం మాట్లాడుతూ అంబేద్కర్ నాయకత్వంలో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగానికి కట్టుబడి అందరం నడుచుకోవాలని పిలుపునిచ్చారు. మండలంలోని గ్రామ సచివాలయాల్లో జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో జెండాను ఎగురవేసి, విద్యార్థులకు సీట్లను పంపిపెట్టారు. కార్యక్రమాల్లో ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఈవోపీఆర్డీ డాక్టర్ వేణయ్య, ఎస్‌ఐ పరమేశ్ నాయక్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, వైస్ ఎంపీపీ శివశంకర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ భీమునిచెరువు పాథమికోన్నత పాఠశాల ఉత్సవంలో పాల్గొన్నారు. తహసీల్దార్ ప్రమీల రెవెన్యూ కార్యాలయంలో జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేశారు.

కేవీబీపురంలో..

కేవీబీపురం: మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, ఎస్‌ఐ సునీల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం జాతీయ జెండాను ఆవిష్కరించి జెండా వందనం చేశారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంఈఓ లక్ష్మీపతి నేతృత్వంలో నిర్వహించిన వేడుకలకు ఎమ్మెల్యే విచ్చేసి విద్యార్థులతో కలిసి జాతీయ గీతాలను ఆలపించారు. జెండా ర్యాలీలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు గవర్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో కేవీబీపురం, కాట్రపల్లి సచివాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశన్, మండల కార్యాలయాల్లో సూపరింటెండెంట్ రాధారాణి, ఎమ్మార్సీలో ఎంఈఓ హేమమాలిని జెడ్పీటీసీ, సింగిల్ విండో కార్యాలయంలో సీఈఓ దొరస్వామి, పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ శ్రీకాంత్ రెడ్డి, పీహెచ్‌సీలో వైద్యాధికారి గాయత్రి త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు జెండా ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి పాల్గొన్నారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండల కార్యాలయాల వద్ద తహసీల్దార్ గౌరీశంకరరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయకుమారి, ఎంపీపీ టి.పద్మప్రియ, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, కడూరు సహకార కార్యాలయం వద్ద చైర్మన్ హరిబాబు రెడ్డి జెండాను ఎగుర వేశారు. ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఎంఈఓ సరస్వతి, పాఠశాలల్లో హెచ్‌ఎంలు మోహన్, రామకృష్ణారెడ్డి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐ నాగార్జునరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు.

నాగలాపురం మండలంలో...

నాగలాపురం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ హనుమంతప్ప, ఎమ్మార్సీలో ఎంఈఓ బాబయ్య, వ్యవసాయ కార్యాలయంలో ఏఓ సుబ్బారావు, పాఠశాలల్లో హెచ్‌ఎంలు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఎస్ఎస్ పురంలో విద్యార్థులు స్వాతంత్ర్య సమరయోధుల వేష ధారణల్లోర్యాలీ చేశారు.

బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ మంజునాథరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రవికుమార్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అరణివిద్యానాథరెడ్డి, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు, ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓ రవీంద్రనాథ్, ప్రాథమిక, ప్రామికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు జాతీయ జెండాను ఎగుర వేశారు


బీఎన్‌కండ్రిగ: జాతీయ పతాకాలతో ఆకట్టుకున్న విద్యార్థులు


పిచ్చాటూరు ఎంపీడీఓ కార్యాలయంలో..


నారాయణవనంలో గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న చిన్నారులు




వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయంలో.., కేవీబీపురం పాఠశాలలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, నాగలాపురం: ఎస్ఎస్ పురంలో త్రివర్ణ పతాకంతో విద్యార్థుల ర్యాలీ

రూ.85 లక్షలతో 3 ప్రభుత్వ భవనాలు


గ్రామ సచివాలయం


రైతు భరోసా కేంద్రం


వైఎస్సార్ హెల్త్ క్లినిక్

- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: మండలంలోని గోవర్ధనగిరిలో రూ.85 లక్షలతో నిర్మించిన మూడు ప్రభుత్వ భవనాలు ప్రారంభానికి ముస్తాబయ్యాయి. వీటిని శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీ కందేరి జయచంద్ర నాయుడు ప్రారంభించనున్నారు.రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రూ.22 లక్షలతో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, రూ.20 లక్షలతో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాన్ని నిర్మించారు. భవనాల ప్రారంభం అనంతరం గోవర్ధనగిరిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి తెలిపారు.

సైన్స్ సెంటర్‌లో ఆర్ట్ ఎగ్జిబిషన్ ప్రారంభం

తిరుపతి అలిపిరి: తిరుపతి ప్రాంతీయ విజ్ఞాన కేంద్రం(సైన్స్ సెంటర్)లో ఏర్పాటు చేసిన పోట్రెయిట్ పెయింటింగ్స్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను గురువారం తుడా వైస్ చైర్మన్ సూర్యదేవర హరికృష్ణ ప్రారంభించారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా తిరుపతి ఆర్ట్ సొసైటీతో కలిసి 73 మంది కళాకారులు తెలుగు రాష్ట్రంలోని స్వాతంత్ర్య సమరయోధుల పోట్రెయిట్ పెయింటింగ్స్‌ను ప్రదర్శింపజేశారు. ఈ ఎగ్జిబిషన్‌కు తుడా వీసీ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, స్వాతంత్ర్య సమరయోధులను నేటితరానికి పరిచయం చేయడానికి ఇలాంటి ప్రదర్శన ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 30 వరకు ఉంటుందని రీజనల్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.